సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



రామ మందిరం..సాహితీ సౌరభం

ఒంటిమిట్ట కోదండ రామయ్య సేవలో ఎందరో కవులు పునీతులయ్యారు. అమూల్య ఆధ్యాత్మిక రచనలను రామయ్యకు అంకితం చేశారు. -8లో



దొంగల్లుడు!

భర్త చనిపోయి బాధలో ఉన్న అత్తను ఓదార్చాల్సిందిపోయి ... ఇదే అదునుగా భావించి ఆ అల్లుడు ఆమె ఇంటికే కన్నం వేశాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ఒంటిమిట్టలో మంత్రుల పర్యటన

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి రాష్ట్ర మంత్రులు సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ విషయాన్ని డివిజనల్ పీఆర్‌ఓ మస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారితో పాటు టీటీడీ, జిల్లా అధికారులు కూడా విచ్చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వీరు సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

నూతన ఎన్నిక



జునైద్ అక్బరీని అభినందిస్తున్న షూటింగ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె సిటీ: జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా జునైద్ అక్బరీ ఎన్నుకున్నారు. ఆదివారం షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యక్రమం జరిగింది. రాయలసీమ జిల్లాల షూటింగ్‌బాల్ కన్వీనర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జునైద్ అక్బరీని జిల్లా కార్యదర్శి గౌతమి, కన్వీనర్ నరేష్‌బాబు తదితరులు అభినందించారు.

11న బీసీల సమరభేరి

రాయచోటి అర్బన్: ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న బీసీ సమర భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన బీఎస్పీ నేతలతో కలసి సమర భేరికి సంబంధించిన గోడపత్రాలు, కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ బీసీ వర్గాలను చైతన్యవంతులను చేసి 52 శాతం రిజర్వేషన్ సాధన కోసం ఉద్యమిస్తున్నట్లుతెలిపారు.కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి పి.నరసింహులు,రాయచోటి అసెంబ్లీ అధ్యక్షుడు నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి: ఎస్పీ

రాయచోటి: జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదివారం పేర్కొన్నారు. జిల్లాలో జరగబోయే అన్ని మతాలకు సంబంధించిన కార్యక్రమాలు, ప్రార్థనలు, ఊరేగింపులను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవించాలన్నారు. అన్ని మతాల వారు, వారి మత కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవడానికి పోలీసులు చేస్తున్న సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. శాంతిభద్రతలు కాపాడేందుకు, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు పోలీసులకు సహకరించాలని కోరుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

నియామకం



షేక్ యూనస్

సుండుపల్లె: ఫార్మసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా షేక్ యూనస్‌ను రాష్ట్ర ఫార్మసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ బాబు శనివారం నియమించారు. ఈ సందర్భంగా యూనస్ మాట్లాడుతూ ఫార్మసిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.ఫార్మసీ చట్టం ప్రకారం ప్రతి మందుల షాపులలో ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, 1948 సెక్షన్ 19 ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకొకసారి ఎన్నికలు జరిపించాలని, స్వతహాగా మెడికల్ స్టోర్ పెట్టుకొనే ఫార్మసిస్టులకు సబ్సిడీతో కూడిన రుణాల కోసం ప్రభుత్వానికి విన్నవిస్తానని తెలిపారు.కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు సంతోష్, కృష్ణవేణి, నాగజ్యోతి, రాధాకృష్ణ, మహేశ్వరరావు, హేమంత్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు

మదనపల్లె సిటీ: జిల్లా షూటింగ్‌బాల్ సబ్ జూనియర్స్ బాల,బాలికల జట్ల ఎంపికలు ఆదివారం స్థానిక నిమ్మనపల్లె బైపాస్‌రోడ్డులోని ప్రైమ్ స్పోర్ట్స్ అరీనాలో నిర్వహించారు. ఎంపికైన వారు ఏప్రిల్ 26,27 తేదీల్లో మదనపల్లె వశిష్టా పాఠశాలలో జరిగే రాష్ట్ర షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోపాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ నరేష్‌బాబు, కార్యదర్శి మురళీ, యూసఫ్‌బాషా, చరణ్, కుమార్ పాల్గొన్నారు.

జట్టుకు ఎంపికైన బాలురు: చరణ్, షణ్ముక్, సాయి, గణేష్, పరమేష్, హమీద్, గౌస్‌అహ్మద్, అజహరుద్దీన్, మౌనిష్, రిత్విక్, యేగేంద్ర, సంజయ్


బాలికలు: అనూష, శారద, నేహా, సంధ్య, ప్రణీత, సుమిత్ర, నవ్య, లాస్య, శశికళ, కరీమున్నీసా, అమూల్య, మమతలు ఎన్నికయ్యారు.

వైభవం.. ధ్వజారోహణం

- ఒంటిమిట్టలో ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శేషవాహనంపై రాములోరి విహారం



శేష వాహనంపై ఊరేగుతున్న రఘురాముడు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు



గరుడ పతాకాన్ని ఎగురవేసిన అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజరోహణ కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు తొలుత హోమం నిర్వహించారు. గరుడ పతాక ప్రదర్శన చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం గరుడ పట్టాన్ని ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభానికి నవకళ పంచామృతాభిషేకం చేసి సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. విష్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, ధ్వజస్తంభ రక్షాబంధనం, ఆరాధన జరిపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిలకించిన భక్త కోటి పులకించింది. కంకణబట్టర్ రాజేష్ ఆధ్వర్యంలో వృషభలగ్నంలో ధ్వజారోహణం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా సతీసమేతంగా విచ్చేసిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఒంటిమిట్ట, సిద్దవటం, రాజంపేట నాయకులు ఉన్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఒంటిమిట్ట పురవీధుల్లో సీతారామలక్ష్మణులను శేషవాహనంపై ఊరేగించారు. వాహన సేవలో కేరళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

స్వామివారిని దర్శించుకున్న ఎస్పీ: వైఎస్సార్ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కుటుంబ సమేతంగా ధ్వజరోహణానికి హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకున్నారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి వాహనసేవలు: బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు వేణుగానాలంకారణలో దాశరథి దర్శనమివ్వనున్నారు. రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరిస్తారు.

కల్యాణానికి తలంబ్రాల తయారీ ప్రారంభం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం ఏప్రిల్ 11న జరగనుంది. ఇందుకోసం ఆదివారం తలంబ్రాల తయారీ ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేసి తలంబ్రాలతోపాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 425 మంది శ్రీవారి సేవకులు లక్షకుపైగా తలంబ్రాల ప్యాకెట్ల తయారీలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ ఈఓ ప్రశాంతి, పీఆర్‌ఓ (ఎఫ్ఏసీ) నీలిమ, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య పాల్గొన్నారు.

కవి సమ్మేళనం: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం బమ్మెరపోతన జయంతిని పురస్కరించుకొని కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి రఘునాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పసుపులేటి శంకర్ శ్రీ భాగవతం ప్రాశస్త్యాన్ని వివరించారు. నారాయణ రెడ్డి, రుక్మిణి సందేశం పోతనామాత్యుల వారి రచన రమణీయకతను, ముకుందుని ముందర రుక్మిణీ రమణి అంతరంగాన్ని ఆవిష్కరించారు. చంద్రశేఖర్ భాగవతంలోని గజేంద్ర మోక్షం అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ గోపాలకృష్ణ శాస్త్రి కుచేలోపాఖ్యానం అనే అంశంపై మాట్లాడారు. శివారెడ్డి వేమన చరిత్రపైన కవిత్వాన్ని చెప్పారు.



ధ్వజారోహణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి దంపతులు



కోదండ రామయ్య సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎస్పీ అశోక్‌కుమార్



గ్రామోత్సవంలో అలరించిన కోలాటాలు



ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్న వలంటీర్లు

వంద పడకలు.... ఎన్నో సమస్యలు



రాయచోటిలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రి భవనం

- మెరుగైన వైద్యంకోసం తప్పని ప్రత్యామ్నాయాలు
- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న ఆక్సిజన్ ప్లాంట్
- నేడు మంత్రి అధ్యక్షతన నూతన కమిటీ సభ్యులతో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

రాయచోటి: జిల్లా కేంద్రం రాయచోటి అధునాతమైన వంద పడకల ఆసుపత్రిలో సరియైన వసతులు, పరికరాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50 పడకల ఆసుపత్రిలోనే నెలకు సరాసరి 20 వేల ఓపీలు ఉన్న దానిని వంద పడకలకు మార్చడానికి వాయిదాలు పడుతూ వచ్చింది.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వ నుంచి రూ. 24 కోట్లు మంజూరు చేయించి భవన నిర్మాణాలు పూర్తయ్యేందుక కృషి చేశారు. 80 శాతం వసతులతో ఏడాది కిందట వంద పడకల ఆసుపత్రిగా ప్రజలకు అంబాటులోకి తెప్పించారు. తరువాత అధికారలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నూతన ఆసుపత్రికి సమకూరాల్సిన వసతుల కల్పనలో తగిన శ్రద్ధ చూపకపోవడంతో పేరుకు మాత్రమే వంద పడకల ఆసుపత్రి.. సేవలు మాత్రం అంతంత మాత్రమే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గెలుపొందారు. మొదటి మంత్రి వర్గంలోనే స్థానం దక్కించుకున్నారు. దీంతో జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రాంతం మరెంతో అభివృద్ధి సాధిస్తుందని, అదే స్థాయిలో ఇక్కడి ప్రభుత్వ అసుపత్రిలో అన్ని వసతులు సమకూరుతాయని ఆనందపడ్డారు. ఈ దశలో గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనల దశలో ఉన్న క్రిటికల్ కేర్ యూటట్‌ను మంత్రి రూ. 23 కోట్లతో మంజూరు చేయించారు. అయితే ఆసుపత్రిలో మరెన్నో సమస్యలు పరిష్కారంకోసం ఎదురు చూస్తున్నాయి. రోగులు ఆధునిక వైద్యం, అత్యవసర చికిత్సలకోసం నేటికీ స్థానిక ప్రైవేటు ఆసుపత్రులు లేదా కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

- గత వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లా కేంద్రం ఏర్పాటుతో పాటు అనేక రంగాల్లో ప్రగతి సాధించిన రాయచోటి పట్టణం నేడు వెనకబడి ఉంది. నిత్యం ప్రమాదాల బారినపడి ఆసుపత్రికి వస్తున్న వారికి ట్రామాకేర్ సెంటర్ లేక వైద్యం అందడం లేదు. దీంతో చిన్నపాటి గాయాలైనా మెరుగైన వైద్యంపేరుతో ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది.

ప్రతిపాదనలకే పరిమితమైన మెటర్నిటీ బ్లాక్

అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటిలోని ఏరియా ఆసుపత్రిలో మెటర్నిటీ బ్లాక్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. రాయచోటి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాలతోపాటు సుండుపల్లి, వీరబల్లి మండలాల ప్రాంతాల్లోని పేద మహిళలు రాయచోటి ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. మెటర్నిటీ ఆసుపత్రి నిర్మిస్తే పేద, మధ్య తరగతి వారికి మంచి వైద్యం అందే అవకాశాలు ఉన్నాయి.దీనిపై ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం లేదు.

ట్రామా కేర్ సెంటర్‌ను త్వరితగతిన నిర్మించాలి.....

అనునిత్యం ప్రమాదాలకు గురై ఆసుపత్రికి వచ్చిన బాధితులకు స్థానికంగా తగిన వైద్యం అందక సుదూరంలో ఉన్న కడప, తిరుపతి ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. జిల్లా కేంద్రమైన రాయచోటి మీదుగా 4 జాతీయ రహదారులు ఉన్నప్పటికీ స్థానికంగా ట్రామాకేర్ ఆసుపత్రి లేకపోవడంతో చిన్నపాటి గాయం తగిలినా స్థానిక వైద్యులు కడప, తిరుపతి ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. మెరుగైన వైద్యంకోసం 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న కడప, వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి పరుగులు తీయాల్సి వస్తుంది. కర్నూలు-చిత్తూరు హైవే, రాయచోటి-మదనపల్లె, రాయచోటి (వయా వేంపల్లి, ప్రొద్దుటూరు) దువ్వూరు, కదిరి-తుముకూరు హైవేలు ఉండటంతో రోజువారి రోగులతోపాటు ప్రమాద బాధితుల తాకిడి అధికంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పూర్తయి మంజూరు దశలో ఉండేది. ప్రభుత్వం మారడంతో ప్రతిపాదనలు అలాగే నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రూ. 23 కోట్లతో మంజూరు చేయించడంతోపాటు ట్రామాకేర్ సెంటర్ నిర్మాణానికి అనుమతులు ఇప్పించారు. ప్రభుత్వం వెనువంటనే టెండర్లు పిలిచి భవన నిర్మాణాలను పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్




రోగుల కోసం అత్యవసర సమయాల్లో అవసరమయ్యే ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా వినియోగానికి నోచుకోకుండా దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. కరోనా సమయంలో ప్రజల సౌకర్యార్థం నాటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అత్యవసరంగా ఒక కోటి, 50 లక్షల రూపాయలతో ప్లాంట్‌ను నిర్మింపచేయించారు. నాడు కొన్ని వందల మంది కరోనా బారిన పడిన వారికి ఈ ప్లాంట్ ద్వారా ఆక్సిజన్ అందించి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం ఇది నిరుపయోగంగా మారడం గమనార్హం.

నూతన పాలకవర్గానికి సమస్యల హారం

రాయచోటి ఏరియా ఆసుపత్రి నూతన పాలకవర్గానికి వంద పడకల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు స్వాగతాలు పలుకుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి సారిగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆసుపత్రి కమిటీ అధ్యక్షునిగా, ఆసుపత్రి సూపరిటెండెంట్ కన్వీనర్‌గా నియమితులై నూతన కమిటీకి సమస్యల పరిష్కారం సవాల్‌గా మారనుంది. తగినంత వైద్యులు, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ సరియైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆసు పత్రిలో సమకూరాల్సిన ఆక్సిజన్ ప్లాంట్, విస్తరణ, ఆపరేషన్ థియేటర్లు తాగునీటి వసతి, పర్నీచర్, ప్రహరిగోడ నిర్మాణం, మెటర్నటీ బ్లాక్ నిర్మాణం, ఈ బ్లాక్‌ను అందుబాటులోకి తేవడం, డయాలసిస్ సెంటర్‌లో మరిన్ని బెడ్స్ సౌకర్యాన్ని కల్పించడం తదితర సమస్యలు నూతన కమిటీకి ఆహ్వానం పలుకుతున్నాయి.


ప్రారంభానికి నోచుకోని ఆపరేషన్ థియేటర్లు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, పాలకుల వైఫల్యమో తెలియదు కానీ రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రారంభం కావాల్సిన రెండు ఆపరేషన్ థియేటర్లు రెండేళ్లుగా మూతపడి ఉన్నాయి. పాత ఆసుపత్రి భవనంలోని ఆపరేషన్ థియేటర్ నేటికీ వాడుకుంటున్నారు. నెలకు వందకుపైగా డెలివరీలు 50 నుంచి వంద వరకు జనరల్ సర్జరీలు ఉన్నప్పటికీ అధునాత వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్లు లేకపోవడం ప్రాణాంతకంగా మారింది. వీటి ప్రారంభోత్సవంపై మంత్రి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ప్రారంభానికి నోచుకోని ఆపరేషన్ థియేటర్ గది

సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. మెటర్నటీ హాస్పిటల్ నిర్మాణం కోసం రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఆసుపత్రికి అవసరమైన వాటన్నింటినీ సోమవారం నిర్వహించనున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చిస్తాం.

-డేవిడ్ సుకుమార్, సూపరిటెండెంట్, ఏరియా ఆసుపత్రి రాయచోటి

పెద్దశేషుడిపై పట్టాభిరాముడు



పెద్ద శేషవాహనంపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

కలికిరి(వాల్మీకిపురం): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైప వాల్మీకిపురం శ్రీ పట్టాభి రామాస్వామి సాలకట్ల బ్రహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి 8 గంటలకు సీతారామలక్ష్మణులు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం 10 గంటల నుంచి స్నపన తిరుమంజనం జరిపారు. సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి శ్రీసీతారామలక్ష్మణులు పెద్ద శేషవాహనంపై కొలువుతీరి తిరుమాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరిండెంట్ మునిబాల కుమార్, అర్చకులు కృష్ణప్రసాద్ బట్టర్, కృష్ణరాజ బట్టర్, ఆలయ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, ఆనందరెడ్డి, అశోక్‌రెడ్డి, జె.క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రహోత్సవాలలో నేడు: సోమవారం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు ఊంజల సేవ, రాత్రి 8.30 గంటలకు పల్లకీలో మోహినీ అవతారోత్సవం కార్యక్రమాలు జరుగనున్నాయి.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన ఉదయ్

బి.కొత్తకోట : అనారోగ్య కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బి.కొత్తకోట పోకనాటి వీధిలో జరిగింది. ఆదివారం సీఐ జీవన్ గంగానాథ్‌బాబు వివరాలను వెల్లడించారు. బి.కొత్తకోటలో ఎలక్ట్రీషియన్‌గా పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్న మారెడ్డి ఉదయ్ (34) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఉదయ్ మృతితో పోకనాటివీధి రామాలయంలో జరగాల్సిన శ్రీరామ నవమి వేడుకలను నిలిపివేశారు.

పిల్లలపై తేనెటీగల దాడి

మదనపల్లె సిటీ : స్థానిక బీటీ కాలేజీ మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువకులపై తేనెటీగలు దాడి చేశాయి. గౌసియావీధికి చెందిన మహమ్మద్‌గౌస్‌తో పాటు మరో ఇద్దరు యువకులు గాయపడ్డారు. గ్రౌండ్‌లో ఉన్న వ్యక్తులు గమనించి వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

అదుపు తప్పి లగేజీ వాహనం బోల్తా


బోల్తా పడిన లగేజీ వాహనం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలోఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ వద్ద ఆదివారం లగేజీ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. కడపకు చెందిన షాహీదర్బార్ హోటల్ వారికి పోరుమామిళ్లలో భోజనాల తయారీ ఆర్డర్ ఉండటంతో వారు కడప నుంచి లగేజీ వాహనంలో భోజనాలకు సంబంధించి కూరగాయలు, నూనె బియ్యం మరికొన్ని వస్తువులను వేసుకుని పోరుమామిళ్లకు బయలుదేరారు. సిద్దవటం మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ వద్దకు రాగానే లగేజీ వాహనం డ్రైవర్ వినయ్ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పడంతో లగేజీ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్య చేసుక్ను సుమియా

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో ఆదివారం జరిగింది. కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీకి చెందిన మహమ్మద్‌అలీ భార్య సుమియా(28) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామ మందిరం..సాహితీ సౌరభం

- కోదండపాణి సేవలో పునీతులైన కవులు
- భాగవతం రచించిన బమ్మెర పోతన
- వాసుదాసు వాల్మీకి రామాయణం అంకితం
- అపర భక్తుడు మాల ఓబన్న



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామయ్య సేవలో ఎందరో కవులు పునీతులయ్యారు. అమూల్య ఆధ్యాత్మిక రచనలను రామయ్యకు అంకితం చేశారు. అయ్యలరాజు తిప్పయ్య క్రీ.శ. 1440లో జగదభిరాముడికి సాహితీ సేవ చేసి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఒంటిమిట్ట రఘువీర జానకీ నాయక మకుటంతో ఆయన వెలువరించిన శతకం లభ్యమైంది. తొలుత రాచరిక పాలనలో తన పాండిత్యాన్ని సాగించినప్పటికీ తరువాత పూర్తిగా దాశరథి సేవకు అంకితమయ్యారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రామయ్య సేవలో తరించిన కవులపై కథనం.

చమత్కార శైలి.. విభిన్నం

అయ్యలరాజు రామభద్రుడు ఒంటిమిట్టలో క్రీ.శ. 1550లో ఇక్కడ నివాసం ఉన్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. రామాభ్యుదయం కావ్యం ఆయన కలం నుంచి జాలువారింది. శ్రీ కృష్ణదేవరాయల అల్లుడు రామరాయల మేనల్లుడు గొబ్బూరి నరసరాజుకు ఈ కావ్యాన్ని అంకితం చేశారు. రామాభ్యుదయం 8 ఆశ్వాసాల గ్రంథం. రామభద్రుని కవిత్వంలో చమత్కారం తొణికిసలాడుతుంది.

చరిత్రపుటలలెక్కని కవి నల్లకాలువ అయ్యప్ప..

చరిత్ర పుటలలెక్కని కవి నల్లకాలువ అయ్యప్ప.. వరకవి నల్లకాలువ అయ్యప్ప కోదండ పాణిని సేవించి వర కవి అయ్యారు. చంద్రగిరిని పాలించిన రెండో వెంకటపతి రాయల బావమరిది కుమారుడు ఓబరాజు. ఈయన సర్వసైన్యాధ్యక్షుడిగా సేవలందించారు. ఆయనను ప్రసన్నం చేసుకుని అయ్యప్ప కృతులు చెప్పారు. నెల్లూరు జిల్లా భీమవరం గ్రామాన్ని అగ్రహారంగా పొందారు. పూర్వం నెల్లూరు నుంచి తిరుపతి వరకు దాడులు జరిగాయి. బద్వేలు, నందలూరు, రాజంపేట, కోడూరు, మామండూరు ప్రాంతాల మీదుగా దాడులు చేశారు. ఈ ఘటనలన్నింటిని నిర్భయంగా శతక రూపంలో అద్భుతమైన పద్యాలతో ఆవిష్కరించారు. ఆ శతకమే 'శతృసంహార వెంకటాచల విహార'

సాహితీ మణి మకుటం

మట్లిరాజులు సిద్దవటం కేంద్రంగా పరిపాలన చేశారు. వీరు రామయ్య క్షేత్రాన్ని వైభవోపేతంగా తీర్చిదిద్దారు. గుడి నిర్మాణ సమయంలో ఉప్పుగొండూరు వెంకట కవి తరచూ సందర్శన నిమిత్తం ఇక్కడకి వచ్చేవారు. ఆ సమయంలోనే ఏకశిలా నగరి రామయ్య మీద దశరథరామ అనే మకుటంతో శతకం రాశారు.

రామయ్యను దర్శించిన అన్నమయ్య

కోదండ రామస్వామిని పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య దర్శించి తన్మయం పొందారు. రాముడిపై అద్భుతమైన కీర్తనలను గానం చేశారు. నేటికి ఈ ప్రాంత ప్రజలకు ఆ కీర్తనలు సుపరిచితం.

ఆయనది సడలని భక్తి భావం



రామాలయం తూర్పు దిశలో మాలకాటిపల్లె గ్రామం ఉంది. ఈ ఊరికి చెందిన భవనాసి మాల ఓబన్న జీవిత లక్ష్యం శ్రీరామచంద్రునిపై సడలని భక్తి భావం. ఆయన అమృత కంఠంతో నిరుపమాన రామకీర్తనలు పాడారు. పగటి పూట పనులు చేసుకుని రాత్రి పూట గుడికి ఎదురుగా ఉన్న సోపానాల ముందు కూర్చుని భజన పాటలు గానం చేసేవారు. బాగా పొద్దుపోయిన తరువాత ఇంటికి వెళ్లేవారు. ఒక రోజు సాయంత్రం రామయ్య దర్శనం కోసం తహసీల్దార్ వచ్చారు. ఆయన రావడాన్ని ఓబన్న గమనించ లేదు. ఆధ్యాత్మికంగా అనురక్తితో లీనమై గానామృతం చేస్తూనే ఉన్నారు. దారికి అడ్డు తొలగ లేదని తహసీల్దార్ ఆయనను దూషించారు. అదే రాజు రాత్రి తహసీల్దార్‌కు కలలో రాముడు కనిపించి భక్తుడిపై దూకుడు ప్రదర్శన మంచిది కాదని హితబోధ చేశారట. ఆ మరుసటి రోజు అధికారి ఓబన్న చెంతకు వచ్చి పొరపాటు జరిగిందని చింతించారు. భవనాసి పట్టుదల, భక్తి భావాన్ని చూసి మెచ్చుకున్నారు. నేటి పాలకులు మాల ఓబన్న సేవలను గుర్తించలేదు. ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని భక్తుల ఆవేదన.

రాముడికే అంకితం చేశారు. వావిలి కొలను సుబ్బారావు



వావిలి కొలను సుబ్బారావు(వాసుదాసు) తన యావదాస్తిని రాముడికి అంకితం చేశారు. వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. కుమారాభ్యుదయం, కౌసల్యా పరిణయం రాశారు. 1908 అక్టోబర్ 9, 10, 11 తేదీలలో రామాయణం గ్రంథాన్ని రాముడికి అంకితం ఇచ్చారు.

అక్షర హాలికుడు పోతన



వ్యాస మహర్షి సంస్కృతంలో రచించిన భాగవతాన్ని బమ్మెర పోతన తెలుగులో రాశారు. మహావిష్ణువును శ్రీరాముడిగా ఆదరించి తరించిన అపర భక్తుడు. భాగవతం రచన చేసి జగదభిరాముడి చరణానికి అంకితం చేశారు. ఇక్కడి నేల తల్లితో మమేకమై అక్షర సేద్యం చేసి హాలికుడిగా ఆయన ప్రత్యేకతను చాటారు. అమూల్య సాహితీ గ్రంథాలను తనకు అంకితమివ్వమని రాజులు అడిగితే అందుకు ఆయన అంగీకరించ లేదు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

సుండుపల్లె : వరకట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామపంచాయతీ వంకబిడికి గ్రామానికి చెందిన మూడే లక్ష్మీదేవికి అదే గ్రామానికి చెందిన నాగేంద్ర నాయక్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వరకట్నం కోసం తన భర్త తనను కొట్టి గాయపరిచి వేధిస్తున్నాడని ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

– వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామిరెడ్డి

చిన్నమండెం : మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంకు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో చెర్లోపల్లి రామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. చెరువుముందర కురవపల్లికి చెందిన చెర్లోపల్లి రామిరెడ్డి తన ద్విచక్ర వాహనానికి భారత్ పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించుకొని స్వగ్రామానికి వెళ్తున్నాడన్నారు. ఈ క్రమంలో చిన్నమండెం నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో రామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు తమ వాహనాలు ఆపి క్షతగాత్రుడిని పరామర్శించి అంబులెన్స్‌కు స్వయంగా ఫోన్ చేసి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుడికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని వారు సూచించారు.

రెడ్డెమ్మతల్లీ..చల్లంగా చూడమ్మా


సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మా..చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి మొక్కుకొన్నారు.సంతాన ప్రదాయినిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు.మొక్కులు తీరిన వారు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.హిందువులతోపాటు ముస్లింలు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవడం గమనార్హం.

జాతీయ స్థాయి పోటీలలో విజేతలు కావడం ప్రశంసనీయం


విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

నందలూరు : ఎస్ఎస్ఐసి-2025 జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా నిలవడం ప్రశంసనీయమని మెడల్, రివార్డ్స్ పొందిన గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు లక్ష్మి చైతన్య, షేక్ జైనబ్‌లను జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం అభినందించారు. గొబ్బిళ్ల అక్షర స్కూల్ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు డీఈఓను కలిశారు.

విద్యార్థులను ఎస్ఎస్ఐసీ మెడల్స్‌తో మరొకసారి సత్కరించారు. చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, కరస్పాండెంట్ గొబ్బిళ్ల శ్రీనాథ్, మెంటర్ వరప్రసాద్, పుత్తా కోటేశ్వరరావులు డీఈఓను శాలువాతో సన్మానించారు.

మేడా విజయశేఖర్ రెడ్డి ఓవరాక్షన్

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి ధ్వజం


వాగ్వాదం చేసుకుంటున్న టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు ధ్వజారోహణం కార్యక్రమంలో మేడా విజయశేఖర్ రెడ్డి ఓవరాక్షన్ చేశారని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సాఫీగా జరుగుతున్న ధ్వజారోహణం కార్యక్రమంలో ఎలాంటి ప్రొటోకాల్ గానీ, అర్హతగానీ లేకుండానే మేడా విజయశేఖర్ రెడ్డి రామాలయంలో వీఐపీలకంటే ఎక్కువ హల్‌చల్ చేశారన్నారు. వేదపండితులతో సమానంగా కూర్చొని మంత్రోచ్చారణ చేయడంతో ఆయన ప్రవర్తనపై భక్తులు కూడా మండిపడ్డారన్నారు. ఇందులో భాగంగానే తమ అనుచరులతో పనిగట్టుకొని వాగ్వాదానికి దిగారని ఆకేపాటి తెలిపారు. టీడీపీలో క్యాడర్ లేకుండా పార్టీ పేరు చెప్పుకుంటూ దుశ్చర్యలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతాలకు గురిచేస్తున్న ఇలాంటి వ్యక్తుల కారణంగా పార్టీ మనుగడకే ప్రమాదం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రహించాలన్నారు.

కవ్వింపు చర్యలు!

- వైఎస్సార్‌సీపీ నేత అహ్మద్ బాషా అరెస్టుతో గోకుల్ సర్కిల్‌లో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్న టీడీపీ శ్రేణులు
- ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసు యంత్రాంగం


స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ శ్రేణులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్‌సీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తమ్ముడు ఎస్.బి అహ్మద్‌బాషాను ఆదివారం తెల్లవారుజామున కడప పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు, వర్గీయులు ఆదివారం రాత్రి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. 2022లో కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దాడి కేసులో ఫిర్యాదుదారుడైన ముస్తాక్ అహ్మద్‌ను, ఇతర అనుచరులను తీసుకుని వచ్చిన కొందరు టీడీపీ కార్యకర్తలు మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి అంజాద్‌బాషా ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న గోకుల్ సర్కిల్ వద్దకు వచ్చి పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. గతంలో ఎవరినైనా అరెస్ట్ చేస్తే ఇలాంటి సంబరాలు చేసుకున్నారా? అని ముక్కున వేలేసుకుని చూస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదనీ, కేవలం కూటమి నేతల కక్షసాధింపు, కవ్వింపు చర్యలు ఎలాంటి వాతావరణానికి దారితీస్తాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ శ్రేణుల సంబరాలను గమనించిన పోలీసులు నిశ్చేష్టులై, ప్రేక్షకపాత్ర పోషించడం గమనార్హం. గతంలో కడప నగర మేయర్ ఇంటి ముందు కావాలనే టీడీపీ నేతలు రెచ్చగొట్టి మహిళలు, ప్రజలచేత చెత్తవేయించడం, రెండు రోజుల క్రితం మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అనుచరుడు ఇబ్రహీం మియాపై దాడి చేయడమేగాక అతన్ని పరామర్శించేందుకు వచ్చిన కారణంగా ఏకంగా మహిళల చేత ప్లకార్డులను ప్రదర్శింపచేసి అంజాద్ బాషా ఇంటిముందు ఆందోళన చేయించడం, తాజాగా ఆదివారం రాత్రి అహ్మద్‌బాషాను పోలీసులు అరెస్ట్ చేశారని బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకోవడం టీడీపీ నేతల కవ్వింపు చర్యలకు పరాకాష్టగా ప్రజలు భావిస్తున్నారు.

చోరీకి యత్నించిన దొంగకు దేహశుద్ధి


దొంగ చేతులను కట్టేస్తున్న స్థానికులు

గాలివీడు : ఓ షాపు వద్ద ఉన్న ఫ్రిడ్జ్‌ను దొంగిలించేందుకు యత్నించిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఓ దుకాణం వద్ద ఉన్న ఫ్రిడ్జ్‌ను తరలించే యత్నం చేశాడు. చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు చూసి అతన్ని తాడుతో బంధించి పోలీసులకు అప్పజెప్పారు. బీహార్, రాజస్థాన్, ఒడిస్సా తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చామంటూ సంచరించే కొత్త వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్నోవా కారు డ్రైవర్ కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్నోవా కారు డ్రైవర్ శ్రీకాంత్‌ను కిడ్నాప్ చేసి, ఇన్నోవా కారును దొంగిలించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బీడీ కాలనీకి చెందిన తాజుద్దీన్, రెండవ గాంధీ బొమ్మ సమీపంలో నివసిస్తున్న నూరుల్లా అనే ఇద్దరు నిందితులను సీఐ ఓబులేసు, సిబ్బందితో కలిసి ఆదివారం బైపాస్ రోడ్డులోని దేవుని కడప ఆర్చి సమీపంలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. మార్చి 15న హైదరాబాద్ నుంచి కారును బాడుగకు తీసుకొచ్చి ఆపై డ్రైవర్ పై దాడి చేసి ఇన్నోవా కారు, బంగారు దోచుకెళ్లిన కేసులో ఒక నిందితుడిని మార్చి 25న అరెస్ట్ చేశారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే రోజున బంగారు ఆభరణం, ఇన్నోవా కారును సీజ్ చేశారు. ఇదే కేసులో పరారైన ప్రధాన నిందితులు ఇరువురిని తాజాగా అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు.

మహిళపై హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

ఖాజీపేట : మహిళపై హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట మండలం పుల్లూరు పంచాయతీలోని పీడబ్ల్యూ బంగళా వద్ద భాగ్య అనే మహిళ నివాసం ఉంటోంది. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఆమె కడపలోని ఓబుల్‌రెడ్డి, అతని తమ్ముడికి చెందిన ఇంటికి తాళం వేసి వచ్చారు. దీంతో వారు గత నెల 31వ తేదీ రాత్రి భాగ్య ఇంటిపై దాడి చేశారు. ఈకేసులో నిందితులైన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

దొంగల్లుడు!

- అత్తారింటికే కన్నం వేశాడు
- 7 తులాల బంగారు ఆభరణాలు చోరీ
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : భర్త చనిపోయి బాధలో ఉన్న అత్తను ఓదార్చాల్సిందిపోయి ... ఇదే అదునుగా భావించి ఆ అల్లుడు ఆమె ఇంటికే కన్నం వేశాడు. రూ.6 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేసి చివరకు పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఆదివారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ వెల్లడించారు. గోపవరం మండలం టీ.సంద్రపల్లె గ్రామానికి చెందిన పిచ్చయ్య, పెంచలమ్మ దంపతులు గత కొన్నేళ్లుగా పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె భర్త అయిన మంగుదొడ్డి మురళి డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. వీరు గతంలో నెల్లూరు జిల్లా కలువాయి గ్రామంలో నివసిస్తూ రెండేళ్ల క్రితం నుంచి అత్తగారింటికి సమీపంలో వేరే ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అయితే గత నెల 18వ తేదీన పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులంతా స్వగ్రామమైన టీ.సంద్రపల్లెకు వెళ్లారు. వారితో పాటు మురళి కూడా వెళ్లాడు. అయితే ముందస్తు ప్రణాళిక ప్రకారం గత నెల 27న బద్వేలుకు వచ్చిన మురళి తెలుగుగంగ కాలనీలో ఉన్న అత్తగారింటికి వెళ్లి చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.6 లక్షలు విలువ చేసే 7 తులాల బంగారు ఆభరణాలు (ఒక లాంగ్‌చైన్, ఒక జత బంగారు గాజులు, ఒక జత బుట్టకమ్మలు, ఒక పాపిడిబిళ్ల) ఎత్తుకెళ్లాడు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా తిరిగి టీ.సంద్రపల్లెకు వెళ్లి కుటుంబ సభ్యులతో ఉన్నాడు. మరుసటిరోజు ఇంటి తాళాన్ని తెరిచి ఉండటం గమనించిన చుట్టుపక్కల వారు పెంచలమ్మ రెండవ కుమార్తె శిరీషకు విషయం తెలపడంతో ఆమె వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులకొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గ్రహించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చోరీ చేసింది అల్లుడు మురళినే అని గుర్తించి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తనతో పాటు ఎస్ఐలు రవి కుమార్, సత్యనారాయణ, సిబ్బంది కలిసి నిందితుడు మురళిని పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు నగలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐలు రవికుమార్, సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు వెంకటేష్, ఓబులేసు, చెన్నారెడ్డి, నరసింహులు, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెద్దమండ్యం : పెద్దమండ్యం-గుర్రంకొండ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ ఇషాక్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా కదిరి టౌన్‌కు చెందిన షేక్ బాబా (48) ఆటోలో గుర్రంకొండకు వెళ్లి తిరిగి కదిరికి వస్తుండగా కలిచెర్ల చెరువు కట్ట వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బాబాకు ఎడమచేతికి, ఎడమ కాలికి గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను చికిత్స కోసం మదనపల్లెకు తరలించారు. తీవ్ర గాయాలైన బాబాను మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అరటి తోట దగ్ధం


దగ్ధమైన అరటితోట

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం ఉప్పరపల్లి గ్రామంలో బోటూరు సుబ్రమణ్యంకు చెందిన ఒకటిన్నర ఎకరా అరటితోట ఆదివారం దగ్ధమైంది. విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగి తోటంతా కాలిపోయింది. సుమారు రూ. 4 లక్షలు వరకు నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.